# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక సంస్కృత భాష అని భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్ అభివర్ణించారు.
- ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలతో పోలింగ్ నిర్వహించడం పైన అభ్యంతరాలను తోసిపుచ్చుతూ సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించింది.
- దేశంలో సార్వత్రిక ఎన్నికలలో భాగంగా నిర్వహించిన రెండవ దశ పోలింగ్ కొద్ది సేపటి క్రితం ముగిసింది.
- రాష్ట్రంలో లోక్ సభ, అసెంబ్లీ స్థానాలకు దాఖలైన నామినేషన్ల పరిశీలన కార్యక్రమం ఈ రోజు నిర్వహించారు.
- విశాఖలో ఆంధ్ర విశ్వవిద్యాలయం 99వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఈ రోజు ఘనంగా జరిగాయి.

==============================

భారతదేశ మేధో, సాంస్కృతిక వారసత్వానికి దోహదపడే భాష సంస్కృతమని భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్ అన్నారు. సంస్కృతం శక్తివంతమైన, చైతన్యవంతమైన భాషగా ఆయన అభివర్ణించారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం మూడవ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా ఈ రోజు ఉపరాష్ట్రపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా 67మందికి బంగారు పతకాలు, 47మందికి పిహెచ్ డిలు, 580మంది విద్యార్థులకు పట్టాలను అందజేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, సమకాలీన సవాళ్లను పరిష్కరించడానికి సంస్కృతం అందించే

జ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. సంస్కృత బాష విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు, ఉత్సుకతను సైతం పెంపొందిస్తుందని ఉప రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) లో పోలైన ఓట్లను వీవీప్యాట్ స్లిప్పులతో వంద శాతం సరిపోల్చడం కుదరదని అత్యున్నత న్యాయస్థానం ఈ రోజు తీర్పు వెలువరించింది. ఈమేరకు ప్రతిపక్షాలు దాఖలు చేసిన పిటిషన్లను తిరస్కరించింది. ప్రస్తుతం కొనసాగుతున్న పద్ధతి బాగుందని పేర్కొంటూ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ఏకాభిప్రాయంతో రెండు తీర్పులు వెలువరించింది. కాగా, ఈవీఎంలతో పోలింగ్ నిర్వహించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పేపర్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించాలనే డిమాండ్ ను కూడా సుప్రీం ధర్మాసనం ఈ సందర్భంగా తోసిపుచ్చింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఈ రోజు నిర్వహించిన  రెండవ దశ పోలింగ్ కొద్ది సేపటి క్రితం ముగిసింది. 12 రాష్ట్రాలతో పాటు  కేంద్ర పాలిత ప్రాంతమైన  జమ్మూ మరియు కాశ్మీర్ లో  ఉన్న ఎనభై ఎనిమిది పార్లమెంటరీ నియోజకవర్గాల  పోలింగ్ ఈ ఉదయం 7 గంటలకు ఆరంభమైంది. ఉత్తర ప్రదేశ్,  కేరళ, రాజస్థాన్, మణిపూర్, త్రిపుర, కర్ణాటక తదితర  రాష్ట్రాల్లో పోలింగ్  కొన సాగింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో లోక్ సభ అసెంబ్లీ స్థానాలకు దాఖలైన నామినేషన్ల పరిశీలన కార్యక్రమం ఈ రోజు నిర్వహించారు.  జిల్లా స్థాయిలో ఎన్నికల సంఘం అధికారుల ఆధ్వర్యంలో నామినేషన్ల పరిశీలన జరుగుతోంది.  నిబంధనలకు అనుగుణంగా లేని వాటిని తిరస్కరించడం జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు  పేర్కొన్నారు.  కాగా, రాష్ట్రంలోని  25 పార్లమెంట్ స్థానాలకు గాను ఒక  వేయి 102 నామినేషన్లు దాఖలు అయ్యాయి.  అలాగే, 175 అసెంబ్లీ స్థానాలకు సంబంధించి అయిదు వేల 960 నామినేషన్లు దాఖలైనట్లుగా అధికారులు  తెలిపారు.  ఇక  ఈ నెల 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది.  30న పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. రాష్ట్రంలో మే 13న పోలింగ్ జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖలో ఉన్న ఆంధ్ర విశ్వవిద్యాలయం 99వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఈ రోజు ఘనంగా జరిగాయి.  ఏయూలో జరిగిన ఒక కార్యక్రమంలో  వ్యవస్థాపక ఉప కులపతి కట్టమంచి రామలింగారెడ్డి చిత్ర పటానికి ఉప కులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి పూల మాలలు వేసి నివాళి  అర్పించారు.  ఈ సందర్భంగా  ఆయన మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన విశ్వవిద్యాలయం ఏయూ అని అన్నారు.  ఈ కీర్తిని మరింతగా పెంచాలని విద్యార్థులకు పిలుపు నిచ్చారు.  ఈ కార్యక్రమంలో పూర్వ  ఉప కులపతులు  అచార్య బీలా సత్యనారాయణ,  వి బాలమోహన్ దాస్, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్ళు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఆంధ్ర విశ్వవిద్యాలయం 1926  ఏప్రిల్ 26 న స్థాపించారు.  వచ్చే ఏడాది నాటికి వందేళ్ళ ఉత్సవాలను జరుపుకోబోతోందని అధికారులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో పొలిటెక్నిక్ లో చేరేందుకు ఉద్దేశించిన ప్రవేశ పరీక్ష పోలీసెట్ -2024ను రేపు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్ష కోసం రాష్ట్రవ్యాప్తంగా 442 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లుగా అధికారులు తెలిపారు. అభ్యర్ధులకు వేసవి కాలం దృష్ట్యా ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాల వద్ద అన్నీ ఏర్పాట్లు చేసినట్లుగా పేర్కొన్నారు. కాగా ప్రభుత్వ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలలో చేరేందుకు అలాగే వివిధ డిప్లమా కోర్సులలో అడ్మిషన్ల కోసం పోలీసెట్ ని నిర్వహిస్తున్నారు. పడవ తరగతి ఉత్తీర్ణులు అయిన విద్యార్ధులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులని అధికారులు తెలియజేసారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం 3వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి జగదీప్ దన్కర్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని సంస్కృత విశ్వవిద్యాలయం విద్యార్ధులు తెలిపారు. ఉపరాష్ట్రపతి పిలుపుతో పాశ్చాత్య సంస్కృతిని పక్కన పెట్టి భారత దేశ సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తామని, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విద్యార్థి యు.భరత్ శర్మ ఆకాశవాణితో మాట్లాడుతూ ....

(వాయిస్ 30 సెకన్లు )

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శ్రీకాకుళం జిల్లాకు నియమితులైన వ్యయ పరిశీలకులు కోమల్ జిత్ మీనా, శరవణ కుమార్, నవీన్ కుమార్ సోనీ ఈ రోజు కలెక్టరేట్ లోని జిల్లా ఎన్నికల నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల కంట్రోల్ రూమ్ ఇంచార్జి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు సిబ్బంది నిర్వర్తిస్తున్న విధులను గురించి పరిశీలకులకు వివరించారు. కంట్రోల్ రూమ్ తో పాటు జిల్లా సీజర్స్ స్కీనింగ్ కమిటీ ద్వారా పట్టుబడిన నగదు, అభరణాలకు సంబంధించిన ఆధారాలు సమర్పించిన అనంతరం అప్పగించడం జరుగుతోందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్వతీపురం మన్యం జిల్లాలోని అరకు పార్లమెంటరీ నియోజకవర్గం పోలీసు విభాగం పరిశీలకులుగా నయీం ముస్తఫా మన్సూరి ను ఎన్నికల సంఘం నియమించింది. అలాగే, సమన్వయ అధికారిగా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎల్ అశోక్ కుమార్ వ్యవహరిస్తున్నారు. ఎన్నికలలో శాంతి భద్రతల సంబంధిత అంశాలపై ఎప్పటికప్పుడు సమాచారంతో పాటు పిర్యాదులను వారికి సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించినట్లు అయితే జ్వరాలు, వ్యాధులు ప్రబలకుండా అదుపులో ఉంచగలమని పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు ప్రజలకు సూచించారు. జిల్లాలోని కొమరాడ మండలం అర్తాం గ్రామంలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని ఆయన ఈరోజు పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉండరాదని అన్నారు. తద్వారా దోమలు వృద్ధి చెందితే మలేరియా, డెంగ్యూ తదితర జ్వరాలకు కారణమవుతాయని ఆయన హెచ్చరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు శ్రీ సత్యసాయి జిల్లా పోలీస్ సూపరెంటెండెంట్ ఎస్వీ మాధవ్ రెడ్డి తెలిపారు. ధర్మవరం సబ్ డివిజన్ లోని సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని పరిస్థితులను స్వయంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణ లేదా నైరుతి దిశ లో గాలులు వీస్తున్నాయని దీని ప్రభావంతో రాగల మూడు రోజులలో ఉత్తర కోస్తా జిల్లాలలో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వానలు కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే, దక్షిణ కోస్తా, రాయల సీమ జిల్లాలలో వాతావరణం పొడి గా ఉండే అవకాశం ఉందని, వడగాలులు ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముందని వివరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన సీనియర్స్ విభాగంలో జిల్లా స్థాయి పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్.రాజు ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వారి ఒరిజనల్ ఆధార్, జన్మదిన ధ్రువపత్రాలు తీసుకుని హాజరు కావాలన్నారు. కాగా, ఈ నెల 30న అండర్ -19 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఎంఎల్ఎన్.రాజు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో సామాజిక పెన్షన్లను లబ్దిదారులకు మే 1వ తేదీన ఇళ్ల వద్దనే పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. విజయవాడలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, అలాగే వడగాల్పులు వీస్తున్నాయని, అందుచేత ఇళ్ల వద్దనే పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =